క్లుప్తంగా

జాతీయస్థాయి బేస్‌బాల్ పోటీలకు విద్యార్థులు ఎంపిక


శృతి


అభినవ్

తిమ్మాపూర్: మహబూబాబాద్ జిల్లా తొర్రూరులో స్కూల్ గేమ్స్ క్రీడా సమాఖ్య ఆధ్వర్యంలో ఇటీవల నిర్వహించిన రాష్ట్రస్థాయి బేస్‌బాల్ పోటీల్లో అండర్ 17 బాల, బాలికల విభాగాల్లో మొగిలిపాలెం విద్యార్థులు సత్తా చాటారు. పోటీల్లో తాల్ల శృతి(9వ తరగతి), కోనేటి అభినవ్(9వ తరగతి) అత్యంత ప్రతిభ కనబర్చి జాతీయస్థాయి పోటీలకు ఎంపికయ్యారు. ఈనెల 3 నుంచి 6వ తేదీ వరకు ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం బిలాస్పూర్‌లో జరిగే 67వ జాతీయ స్థాయి పోటీలో పాల్గొంటారని హెచ్‌ఎం నరసింహారెడ్డి తెలిపారు. క్రీడాకారులను వ్యాయామ ఉపాధ్యాయుడు శ్రీనివాస్, ఉపాధ్యాయ బృందం, సర్పంచ్ సుస్మితా రెడ్డి, ఎంపీటీసీ తిలక్ ప్రియారెడ్డి అభినందించారు.

నలుగురిపై కేసు నమోదు

తిమ్మాపూర్: కార్పొరేషన్ పరిధిలోని ఎనిమిదో డివిజన్ అలుగునూర్ చౌరస్తాలో గత నెల డిసెంబర్ 31న న్యూ ఇయర్ వేడుకల్లో భాగంగా రాజీవ్ రహదారిపై అనుమతి లేకుండా పటాసులు కాల్చడంతోపాటు అడ్డుకున్న పోలీసులపై దురుసుగా ప్రవర్తించిన నలుగురిపై కేసు నమోదు చేశామని ఎల్‌ఎండీ ఎస్‌ఐ చేరాలు తెలిపారు. నలుగురుని రిమాండ్ చేసి మంగళవారం కోర్టులో హాజరుపరచగా బెయిల్ మంజూరైందని ఎస్సై వివరించారు.

బీఆర్‌ఎస్‌కు రాజీనామా

మానకొండూర్: బీఆర్‌ఎస్ ప్రాథమిక సభ్యత్వానికి రాజీనామా చేసినట్లు చెంజర్ల మాజీ సర్పంచ్ పడాల శంకరయ్య ఒక ప్రకటనలో తెలిపారు. నాలుగేళ్ల క్రితం కాంగ్రెస్‌ను వీడి బీఆర్‌ఎస్‌లో చేరగా వ్యక్తిగత కారణాల వల్ల బీఆర్‌ఎస్‌ను వీడుతున్నానని, రాజీనామా పత్రం మండల అధ్యక్షుడికి పంపినట్లు వివరించారు.

ఎంపీ ఎన్నికలే లక్ష్యంగా ముందుకు సాగాలి

కరీంనగర్: కాంగ్రెస్, బీజేపీ విష ప్రచారాన్ని తిప్పికొట్టాలని, పార్లమెంట్ ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా ముందుకు సాగాలని, పదేళ్లలో జరిగిన ప్రగతిని క్షేత్రస్థాయిలో వివరించేలా కార్యకర్తలను సన్నద్ధం చేయాల్సిన అవసరముందని నగర మేయర్ వై.సునీల్‌రావు, బీఆర్‌ఎస్ నగర అధ్యక్షుడు చల్ల హరిశంకర్ పిలుపునిచ్చారు. మంగళవారం మీసేవ కార్యాలయంలో కరీంనగర్ అసెంబ్లీ నియోజకవర్గ బీఆర్‌ఎస్ ముఖ్య నాయకులు, ప్రజాప్రతినిధుల సమావేశంలో మాట్లాడారు. ఈనెల 4న కరీంనగర్ పార్లమెంట్ స్థాయి సమావేశం హైదరాబాద్‌లో జరగనుందని, సమావేశానికి స్థానిక ఎమ్మెల్యే గంగుల కమలాకర్‌తో పాటు ముఖ్య నాయకులు హాజరు కానున్నారని వెల్లడించారు. గ్రంథాలయ సంస్థ చైర్మన్ అనిల్‌కుమార్, కొత్తపల్లి మున్సిపల్ చైర్మన్ రుద్ర రాజు, కోఆప్షన్ సభ్యులు జమీల్, ఎంపీపీ లక్ష్మయ్య, నాయకులు శ్యాంసుందర్‌రెడ్డి, సుంకిశాల సంపత్‌రావు, రాజేశ్వర్‌రావు తదితరులు పాల్గొన్నారు.

మహిళా సాధికారతపై సమన్వయ సమావేశం

కరీంనగర్: మహిళ సాధికారత, వారి ఆర్థిక బలోపేతం కోసం వ్యాపార ప్రోత్సాహం వంటి అంశాలపై మహిళాభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో సమన్వయ సమావేశం నిర్వహించారు. సప్తగిరికాలనీలోని సఖి కేంద్రంలో ఏర్పాటు చేసిన ఈ సమావేశానికి విహబ్, సఖి, డీహెచ్‌ఈఎల్ అధికారులు, సిబ్బంది హాజరయ్యారు. జిల్లా సంక్షేమ అధికారి సరస్వతి మాట్లాడుతూ.. మహిళల ఆర్థిక బలోపేతానికి అవసరమైన సలహాలు, సూచనలు అందించాల్సిన అవసరం మహిళా శిశు సంక్షేమ శాఖపై ఉందన్నారు. డీహెచ్‌ఈఎల్, సఖి సిబ్బంది ఈ దిశగా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. వ్యాపార రంగంపై ఆసక్తి కలిగిన మహిళలకు విహబ్ నుంచి ఏవిధమైన సహాయం అందుతుందో సంబంధిత సిబ్బంది వివరించారు. జిల్లా మహిళా సాధికారిత కేంద్రం జిల్లా మిషన్ కోఆర్డినేటర్ శ్రీలత, సఖి అడ్మిన్ లక్ష్మి, స్కిల్ కోఆర్డినేటర్ సురేష్ పాల్గొన్నారు.

విద్యార్థులకు పోటీలు

కరీంనగర్‌రూరల్: మొగ్దుంపూర్‌లోని జెడ్పీ పాఠశాలలో మంగళవారం జాతీయ వైజ్ఞానిక కల్పన దినోత్సవం పురస్కరించుకొని హమ్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో విద్యార్థులకు వ్యాసరచన, ఉపన్యాస పోటీలు నిర్వహించారు. సంస్థ వ్యవస్థాపకుడు ధనపురి సాగర్ గెలుపొందిన వారికి బహుమతులందించారు.

వచ్చేనెల 11న ప్రవేశ పరీక్ష

కొత్తపల్లి(కరీంనగర్): ఎస్సీ, ఎస్టీ, బీసీ ప్రభుత్వ గురుకుల పాఠశాలలతో పాటు జనరల్ గురుకుల పాఠశాలల్లో 2024–25 విద్యా సంవత్సరం 5వతరగతిలో ప్రవేశానికి తెలంగాణ ప్రభుత్వం రాష్ట్రవ్యాప్తంగా వివిధ కేంద్రాల్లో వచ్చేనెల 11న ఉదయం 11 నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు ఉమ్మడి ప్రవేశ పరీక్ష నిర్వహిస్తున్నట్లు చింతకుంట తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ జెజె.థెరిస్సా ఒక ప్రకటనలో తెలిపారు. అభ్యర్థులు ఈనెల 6 లోగా ఆన్‌లైన్‌లో రూ.100 చెల్లించి దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

కలగానే వారధి

- మల్లారెడ్డిపల్లి-కనగర్తి, కొండపాక-పొత్కపల్లి గ్రామాల మధ్య వంతెనలకు మోక్షమెప్పుడో..?
- రెండుచోట్ల నిర్మిస్తే మూడు జిల్లాలకు మేలు
- చెక్‌డ్యాంల నిర్మాణాలతో ప్రయాణికుల అవస్థలు
- నిధులు మంజూరు చేయాలంటున్న ప్రజలు

వీణవంక: మండలంలోని మల్లారెడ్డిపల్లి–కనగర్తి, కొండపాక–పొత్కపల్లి గ్రామాల మధ్య ఉన్న మానేరు వాగుపై వంతెనల నిర్మాణం కలగానే మిగిలింది. గతంలో నక్సల్స్ ప్రభావిత ప్రాంతాలకు కేంద్రం నిధులు మంజూరు చేసిందని పుకార్లు లేచాయి. కానీ ఇప్పటివరకు ఆ దిశగా మోక్షం లేకపోవడంతో వంతెనల నిర్మాణం అటకెక్కింది. మానేరు వాగుపై బ్రిడ్జీలు నిర్మిస్తే మూడు జిల్లాలకు రవాణా సులభతరం కానుంది. ఇరు గ్రామాల ప్రజలు కలిసి వాగులో నుంచి ప్రయాణం చేయాల్సి వస్తోంది. అప్పట్లో మట్టి రోడ్డు ఉండగా ఇటీవల చెక్‌డ్యాంలు నిర్మించడంతో వరద వచ్చినప్పుడు ద్విచక్రవాహనాలను నెట్టుకుంటు వెళ్తున్నారు. మానేరు వాగు కరీంనగర్ ఎల్‌ఎండీ దిగువ నుంచి ప్రారంభమై మానకొండూరు, వీణవంక మండలం మీదుగా మామిడాలపల్లి, చల్లూరు, కొండపాక, జమ్మికుంట మండలం తనుగుల మీదుగా ప్రవహిస్తోంది. కొండపాక గ్రామంలో వాగు అవతలి వైపు పొత్కపల్లి ఉంది. ఇక్కడ వంతెన నిర్మిస్తే ఆదిలాబాద్, పెద్దపల్లి, మంచిర్యాల జిల్లాలకు వెళ్లే ప్రజలకు దూరం తగ్గనుంది. ప్రస్తుతం కొండపాక నుంచి ద్విచక్రవాహనదారులు వాగు దాటి పొత్కపల్లి వైపు వెళ్తున్నారు. వర్షాలు కురిసినప్పుడు రాకపోకలు నిలిచిపోతుండటంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు.

దూరభారం తగ్గుతుంది

వంతెనలు నిర్మిస్తే రాకపోకలు సులభతరమవుతాయని గుర్తించిన అప్పటి మంత్రి ఈటల రాజేందర్ నిధుల మంజూరుకు కృషి చేసిన కార్యరూపం దాల్చలేదు. ఇదే వాగుపై జమ్మికుంట మండలం తనుగుల– ఓదెల మండలం గుంపుల గ్రామాల మధ్య రామభద్ర వంతెనను నిర్మించారు. అదేవిధంగా సుల్తానాబాద్ మండలం నీరుకుల్ల–వేగురుపల్లి గ్రామాల మధ్య కూడా మరో వంతెన నిర్మించారు. ఈ రెండు వంతెనలు ద్వారా ప్రయాణం దూరమవుతుండటంతో కొండపాక–పొత్కపల్లి మధ్య నిర్మాణం చేపట్టాలని అప్పట్లో ప్రజలు కేంద్రానికి ఫిర్యాదు చేశారు. ఈ గ్రామాల మధ్య వంతెనలు నిర్మిస్తే వరంగల్, హుస్నాబాద్, జమ్మికుంట, హుజూరాబాద్ , వీణవంక ప్రాంత ప్రజలు కొండపాక మీదుగా పెద్దపల్లి జిల్లాకు వెళ్లొచ్చు. దీంతో ప్రజలకు 30 కిలోమీటర్ల దూరం తగ్గనుంది.

రవాణా సౌకర్యం మెరుగు...

ఆదిలాబాద్, పెద్దపల్లి జిల్లాల ప్రజలు వరంగల్, హుజూరాబాద్ ప్రాంతాలకు వెళ్లాలంటే గుంపుల మీదు నుంచి వెళుతున్నారు. అదే కొండపాక, మల్లారెడ్డిపల్లి వద్ద మానేరు వాగుపై వంతెనలు నిర్మిస్తే దూరం తగ్గనుంది. అదేవిధంగా ఉత్తర తెలంగాణలోనే జమ్మికుంట వ్యవసాయ మార్కెట్ ప్రథమ స్థానంలో ఉంది. ముత్తారం, ఓదెల, కాల్వశ్రీరాంపూర్ మండలాల నుంచి ప్రజలు పత్తి, వరి ధాన్యం జమ్మికుంటలోనే విక్రయిస్తుంటారు. దీంతో మూడు జిల్లాల వ్యాపార అభివృద్ధితో పాటు రవాణా సౌకర్యం మరింత మెరుగవుతుంది. ఇప్పటికైన జిల్లా మంత్రి స్పందించి వంతెనల నిర్మాణానికి కృషి చేయాలని ప్రజలు కోరుతున్నారు.


కొండపాక-పొత్కపల్లి మధ్య వంతెన నిర్మించాల్సిన ప్రదేశం

వంతెన నిర్మించాలి



మల్లారెడిపల్లి– కనగర్తి గ్రామాల మధ్య వంతె న నిర్మిస్తే రెండు జిల్లాల వ్యాపార అభివృద్ధితో పాటు రవాణా సౌకర్యం మరింత మెరుగవుతుంది. పెద్దపల్లి జిల్లాకు వెళ్లాలంటే జమ్మికుంట మండలం తనుగుల వంతెన మీదుగా ప్రజలు వెళుతున్నారు. దీంతో రవాణా ఖర్చులు మీద పడుతున్నాయి. అదే మల్లారెడ్డిపల్లి మీదుగా వెళ్తే 30 కిలోమీటర్ల దూరం తగ్గుతుంది. గతంలో ఏటా వాగులో మట్టిరోడ్డు పోశారు. అయితే వరదకు కొట్టుకుపోయేది. చెక్‌డ్యాంలు నిర్మించడంతో ప్రయాణికులకు ఇబ్బందైతంది. ప్రభుత్వం వంతెనలు నిర్మించాలి.

– ఎల్లారెడ్డి, సర్పంచ్, మల్లారెడ్డిపల్లి

వినతిపత్రం ఇచ్చాం



కొండపాక, మల్లారెడ్డిపల్లి వాగుపై వంతెనలు నిర్మించాలని గతంలో మంత్రులకు, అధికారులకు వినతిపత్రం ఇచ్చాం. అధికారులు కూడా సర్వే చేసుకొని వెళ్లారు కానీ ఇంత వరకు అతీగతి లేదు. ఇప్పటికైన ఈ రెండు గ్రామాల మధ్య వంతెన నిర్మించాలి. మల్లారెడ్డిపల్లి మీదుగా సుల్తానాబాద్, పెద్దపల్లికి వెళ్లాలంటే కేవలం 20 కిలోమీటర్ల దూరం ఉంటుంది. అదే జమ్మికుంట మీదుగా వెళ్లాలంటే అదనంగా 25 కిలోమీటర్ల దూరం ప్రయాణం చేయాల్సివస్తోంది. ఇప్పటికీ వాహనదారులు వాగులోంచి వెళ్తున్నారు. వాగులో నీళ్లు ఉండటంతో ఇబ్బంది పడుతున్నారు.

– పల్లెర్ల కిరణ్, మల్లారెడ్డిపల్లి

సీఎం రేవంత్‌రెడ్డిని కలిసిన వొడితెల ప్రణవ్


ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి పుష్పగుచ్ఛం అందిస్తున్న వొడితెల ప్రణవ్

హుజూరాబాద్: హైదరాబాద్‌లోని సచివాలయంలో రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని మంగళవారం కాంగ్రెస్‌పార్టీ హుజూరాబాద్ నియోజకవర్గ ఇన్‌చార్జి వొడితెల ప్రణవ్ మంగళవారం మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రికి పుష్పగుచ్ఛం అందించి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు.

భూ ఆక్రమణపై కలెక్టర్‌కు ఫిర్యాదు

జమ్మికుంట: పట్టణంలోని హౌజింగ్‌బోర్డు కాలనీలోని ప్రభుత్వ భూమిని వార్డు కౌన్సిలర్ శ్రీపతి నరేశ్ ఆక్రమించి అక్రమ నిర్మాణాలు చేస్తున్నాడని పట్టణానికి చెందిన మాజీ వార్డు మెంబర్ తూడి రవిచందర్, కాలనీకి చెందిన పలువురు మంగళవారం కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. గతంలో ప్రభుత్వ భూమిని నివేశన స్థలాలుగా చేసి అమ్మకాలు చేశారు. అందులో మిగిలిన భూమిని హౌజింగ్‌బోర్డు కాలనీ కౌన్సిలర్ ఆక్రమించారని, మున్సిపల్ అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదని ఫిర్యాదులో పేర్కొన్నారు.

ఇంటింటికీ రాముడి అక్షింతలు


కొండపల్కల గ్రామంలో అక్షింతలతో భక్తులు


కనగర్తి గ్రామంలో శ్రీరాముడి చిత్రపటంతో శోభాయాత్ర

మానకొండూర్: మండలంలోని కొండపల్కల గ్రామంలో అయోధ్య నుంచి తీసుకొచ్చిన శ్రీరాముడి అక్షింతలను ఎంపీటీసీ గుర్రాల వెంకటరెడ్డి మంగళవారం ఇంటింటికీ పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఆలయ అర్చకుల రఘురామాచార్యులు, మాడ నారాయణరెడ్డి, గడ్డం మార్కొండయ్య, మాడ తిరుపతిరెడ్డి, రావుల శంకరాచారి, అడప రవి, దూలం కిరణ్‌గౌడ్, రంగు సంపత్‌గౌడ్, సైండ్ల శ్రీనివాస్, శీలం కుమార్‌యాదవ్, శాతరాజు శ్రీనివాస్, మిరాల శ్రీనివాస్, నల్ల రాజిరెడ్డి, నల్ల నరేందర్‌రెడ్డి, గడ్డం పోచమల్లు, భక్తుల బృందం సభ్యులు పాల్గొన్నారు.

ఇల్లందకుంట: ఇంటింటికీ అయోధ్య రాముడి అక్షింతలు చేరాలని శ్రీరామ జన్మభూమి తీర్థ క్షేత్ర సభ్యుడు మట్టపవన్‌రెడ్డి అన్నారు. మండలంలోని కనగర్తి గ్రామంలోని ఉమామహేశ్వరస్వామి దేవాలయంలో అయోధ్య నుంచి వచ్చిన అక్షింతలు, రామమందిరం ఫొటోలు, తీర్థ క్షేత్ర కరపత్రాలకు మంగళవారం ప్రత్యేక పూజలు చేసి గ్రామ వీధుల్లో శోభాయాత్ర నిర్వహించారు. అనంతరం ఇంటింటికీ అక్షింతలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 22న అయోధ్యలో రాముడి విగ్రహ ప్రాణప్రతిష్ఠ జరుగుతుందన్నారు. కార్యక్రమంలో అర్చకులు లంక నారాయణ, దురిశెట్టి ఓంకార్, ట్రస్ట్‌సభ్యులు సింగిరెడ్డి తిరుపతిరెడ్డి, ఆలయ కమిటీ చైర్మన్ శ్రీనివాస్, ఎంపీటీసీ రమభిక్షపతి, రాకేశ్, మాజీ ఎంపీటీసీ భాగ్య, ఉపసర్పంచ్ మహేందర్, మాజీ సర్పంచ్ లలిత, రాజు, అంజిరెడ్డి, మల్లేశ్, సదానందం, భరత్, శివరామకృష్ణ, భజన మండలి సభ్యులు పాల్గొన్నారు.

ప్రమాదకరంగా విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్

కరీంనగర్‌రూరల్: నల్లగుంటపల్లిలో విద్యుత్ శాఖ అధికారులు చేస్తున్న పనులు వివాదాస్పదమవుతున్నాయి. తాత్కాలికంగా ఏర్పాటు చేసిన ట్రాన్స్‌ఫార్మర్ ప్రమాదకరంగా మారింది. ఐదు నెలల క్రితం రక్షిత తాగునీటి బావికి విద్యుత్ సరఫరా చేసే ట్రాన్స్‌ఫార్మర్ కాలిపోవడంతో నీటి సరఫరా నిలిచిపోయింది. అయితే పొలాల నడుమ ఉన్న ట్రాన్స్‌ఫార్మర్‌ను ట్రాక్టర్‌పై తీసుకొచ్చేందుకు గ్రామస్తులు పడరాని పాట్లు పడ్డారు. భారీ వర్షాలతో పొలాల్లో కొత్త ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేసే అవకాశం లేకపోవడంతో అధికారులు గ్రామ శివారులో గద్దె నిర్మించగా.. స్థానికులు కూల్చేశారు. అనంతరం సిమెంట్ పైపుపై తాత్కాలికంగా ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేశారు. పోచమ్మ గుడి దారిలో ప్రమాదకరంగా ఉన్న ట్రాన్స్‌ఫార్మర్‌ను మరోచోట గద్దె నిర్మించి ఏర్పాటు చేయాలని స్థానిక రైతులు పలుమార్లు విజ్ఞప్తి చేసినా.. అధికారులెవ్వరూ పట్టించుకోవడం లేదనే ఆరోపణలున్నాయి. మూడు రోజుల నుంచి శ్మశానవాటికకు స్థానికులకు సమాచారమివ్వకుండానే అధికారులు కొత్త విద్యుత్ లైన్ వేయడం వివాదాస్పదంగా మారింది. విద్యుత్ శాఖ అధికారులు స్థానికులను సంప్రదించకుండానే ఇష్టరాజ్యంగా పనులు చేస్తున్నారని దుర్శేడ్ సింగిల్ విండో డైరెక్టర్ వేల్పుల రమేశ్ ఆరోపించారు.


సిమెంట్ పైపుపై విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్

ప్రమాదకరంగా ఉన్న ట్రాన్స్‌ఫార్మర్‌ను తొలగించి మరోచోట ఏర్పాటు చేసేందుకు ఉన్నతాధికారులు తగిన చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు.

ఆరు గ్యారంటీలు అమలు చేస్తాం


చొప్పదండి: ప్రజాపాలన కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం


తిమ్మాపూర్: దరఖాస్తులు స్వీకరిస్తున్న ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ

- చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం

చొప్పదండి: అధికారంలోకి రాగానే రాష్ట్ర ప్రభుత్వం ఆరు గ్యారంటీల అమలుకు శ్రీకారం చుట్టిందని ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం అన్నారు. పట్టణంలోని ఏడు, ఎనిమిది, పదకొండు వార్డుల్లో మంగళవారం నిర్వహించిన ప్రజాపాలనకు హాజరై మాట్లాడారు. అత్యధిక మెజారిటీతో గెలిపించిన నియోజకవర్గ ప్రజల మేలు మరిచిపోలేనని, ఎవరికీ లంచం ఇవ్వాల్సిన అవసరం లేదని, పోలీసులు లేదా తనకే నేరుగా కంప్లైంట్ చేయాలని సూచించారు. దళితబంధు, బీసీ బందు, కుల సంఘాల భవనాలకు అనుచరవర్గం నుంచి కమీషన్లు తీసుకున్న చరిత్ర గత ప్రభుత్వానికి ఉందని, కాంగ్రెస్‌ను నమ్మి ఓటేసినందుకు ఆరు గ్యారంటీలను అమలు చేస్తామన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ నీరజ, మున్సిపల్ కమిషనర్ శాంతికుమార్, డీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ పద్మాకర్‌రెడ్డి, గంగయ్యగౌడ్, అశోక్, శ్రీనివాస్, ముద్దం తిరుపతిగౌడ్, మునిగాల సుధాకర్ గౌడ్, గుర్రం రాజేందర్‌రెడ్డి, మునిగాల చందు, తదితరులు పాల్గొన్నారు.

రామడుగు: మండలంలోని కిష్టాపూర్, గోలిరామయ్యపల్లి, గుండి, కొక్కెరకుంట గ్రామాల్లో దరఖాస్తులు స్వీకరించారు. మండల ప్రత్యేకాధికారి ప్రియదర్శిని, ఎంపీడీవో భాస్కర్‌రావు, తహసీల్దార్ భాస్కర్, సర్పంచ్‌లు రాధమ్మ, మానస, అభిషేక్‌రెడ్డి, శ్రీలత, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ ఉప్పుల అంజనీప్రసాద్, పలువురు పాల్గొన్నారు.

అర్హులకే సంక్షేమ పథకాలు

- ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ

తిమ్మాపూర్: అర్హులైన ప్రతి ఒక్కరికి ఆరు గ్యారంటీలను కాంగ్రెస్ పార్టీ పక్కగా అమలు చేస్తామని ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ అన్నారు. మండలంలోని మహాత్మానగర్, మల్లాపూర్, మన్నెంపల్లి, మక్తపల్లి గ్రామాల్లో నిర్వహించిన ప్రజాపాలనలో పాల్గొన్నారు. ఎమ్మెల్యేకు గ్రామస్తులు ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా కవ్వంపల్లి సత్యనారాయణ మాట్లాడారు. గత ప్రభుత్వ పాలనలో అర్హులకు కాకుండా పార్టీ కార్యకర్తలకే సంక్షేమ పథకాలను అందజేశారని.. కాంగ్రెస్ పాలనలో అర్హులకే తప్పా అనర్హులకు ఇవ్వమని స్పష్టం చేశారు. కార్యక్రమంలో ఎంపీపీ కేతిరెడ్డి వనిత, స్పెషల్ ఆఫీసర్ జయశంకర్, ఎమ్మార్వో కనకయ్య, ఎంపీడీవో రవీందర్‌రెడ్డి, సర్పంచులు శ్రీవాణి రవీందర్, అంజయ్య, ఉప సర్పంచ్ అనిల్‌గౌడ్, నాయకులు ఎస్‌ఎల్‌గౌడ్, సతీశ్, సరితప్రసాద్, ఎంపీటీసీలు కనకయ్య, తిరుపతిరెడ్డి, బండారి రమేశ్, లక్ష్మారెడ్డి, రెడ్డిగాని రాజు, తదితరులు పాల్గొన్నారు.

వెల్లువెత్తిన దరఖాస్తులు

శంకరపట్నం: మండలంలోని కల్వల, ఇప్పలపల్లి, గొల్లపల్లి, కాచాపూర్ గ్రామాల్లో దరఖాస్తులు స్వీకరించారు. తహసీల్దార్ అనుపమ, జెడ్పీటీసీ శ్రీనివాస్‌రెడ్డి, సర్పంచులు రజిత, కొండ్ర రాజయ్య, బైరి సంపత్ పాల్గొన్నారు.

మానకొండూర్: మండలంలోని కెల్లెడ, లలితాపూర్, ఖాదర్‌గూడెం, జగ్గయ్యపల్లి గ్రామాలలో అధికారులు దరఖాస్తులు స్వీకరించి రశీదులు అందజేశారు. మండల స్పెషల్ ఆఫీసర్ వెంకటేశ్వర్లు, ఎంపీడీవో రాజేశ్వర్‌రావు, ఎంఈవోమధుసూదనాచారి, మండల వ్యవసాయాధికారి శ్రీనివాస్‌రెడ్డి, పంచాయతీ కార్యదర్శులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

గన్నేరువరం: మండలంలోని మైలారం, సాంబయ్యపల్లె, పీచుపల్లి, పారువెల్ల గ్రామాల్లో అధికారులు ప్రజాపాలన దరఖాస్తులు స్వీకరించారు. ఎంపీపీ మల్లారెడ్డి, సహకార సంఘం మాజీ చైర్మన్ కోటి, ఎంపీడీవో స్వాతి, ఏవో కిరణ్మయి, ఏపీఎం లావణ్య, తదితరులు పాల్గొన్నారు.

చిగురుమామిడి: మండలంలోని నవాబుపేటలో తహసీల్దార్ ఈ. నరేందర్, ఓగులాపూర్, పీచుపల్లి గ్రామాల్లో ఎంపీడీఓ ఎం. నర్సయ్య ఆధ్వర్యంలో దరఖాస్తులు స్వీకరించినట్లు ఎంపీడీఓ నర్సయ్య తెలిపారు. ప్రజాపాలన కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని జెడ్పీటీసీ గీకురు రవీందర్ కోరారు. కాంగ్రెస్ మండలపార్టీ అధ్యక్షుడు కంది తిరుపతిరెడ్డి, మైనార్టీ సెల్ అధ్యక్షుడు షాబుద్దీన్, వికలాంగుల సంఘం జిల్లా కన్వీనర్ నాగరాజు, సోషల్ మీడియా కన్వీనర్ బోయిని వేణుగోపాల్, ఎన్‌ఎస్‌యూఐ మండల అధ్యక్షుడు తేజసింగ్, నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

హుజూరాబాద్: మున్సిపాలిటీ పరిధిలోని వివిధ వార్డుల్లో నిర్వహించిన ప్రజాపాలనకు దరఖాస్తులు వెల్లువెత్తాయి. మొత్తం 30 వార్డుల్లో 7,009 దరఖాస్తులు స్వీకరించినట్లు కమిషనర్ సమ్మయ్య తెలిపారు.

జమ్మికుంట: మున్సిపల్ పరిధి 30 వార్డుల్లో నిర్వహించిన కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ బి. శ్రీనివాస్, అధికారులు సిబ్బంది పాల్గొన్నారు. మండలంలోని పెద్దంపల్లి, సైదాబాద్, శంభునిపల్లి, సాయంపేట గ్రామాల్లో దరఖాస్తుల స్వీకరించారు. తహసీల్దార్ రజని, ఎంపీడీవో కల్పన ప్రజలకు అవగాహన కల్పించారు. కాంగ్రెస్ నాయకుడు మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ సమ్మిరెడ్డి, ఎంపీవో సతీశ్‌కుమార్, డిప్యూటీ తహసీల్దార్ శ్రీనివాస్, ఆర్‌ఐ సంతోష్, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

హుజూరాబాద్‌రూరల్: మండలంలోని శాలపల్లి–ఇందిరానగర్ గ్రామంలో ప్రజాపాలన దరఖాస్తులు పూరించడంపై నాయకులు విజయ్‌కుమార్, చక్రపాణి, రాకేష్, శ్రీధర్, రమేశ్ అవగాహన కల్పించారు.

వీణవంక: మండలంలోని ఇప్పలపల్లి ,కనపర్తి, ఘన్ముక్కుల, హిమ్మత్‌నగర్ గ్రామాల్లో అధికారులు దరఖాస్తులు స్వీకరించారు. ప్రజలు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీవో శ్రీనివాస్, తహసీల్దార్ తిరుమల్‌రావు కోరారు. ఎంపీవో ప్రభాకర్, పీఆర్‌ఏఈ రాంబాబు, ఏవో గణేశ్, కాంగ్రెస్ నాయకులు, తదితరులు ఉన్నారు.

సైదాపూర్: మండలంలోని లస్మన్నపల్లి, పెరుకపల్లి, రాయికల్, నల్లరామయ్యపల్లి గ్రామాల్లో ప్రజాపాలన దరఖాస్తులు స్వీకరించారు. తహసీల్దార్ మంజుల, ఎంపీడీవో పద్మావతి, సిబ్బంది, సర్పంచులు రాములు, కొమురయ్య, కాంగ్రెస్ సీనియర్ నాయకుడు శ్రీనివాస్, సింగిల్ విండో డైరెక్టర్ ప్రకాశ్‌రెడ్డి, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.



పెట్రోల్ బంకుల వద్ద బారులు

మానకొండూర్: కేంద్ర ప్రభుత్వ నిబంధనలు వ్యతిరేకిస్తూ ట్రక్‌డ్రైవర్ల ఆందోళన నేపథ్యంలో పెట్రోల్ బంకుల వద్ద వాహనదారులు బారులు తీరారు. పెట్రోలు, డీజిల్ కోసం క్యాన్లతో క్యూలో నిలుచున్నారు. బాటిళ్లలో పెట్రోలు తీసుకెళ్లేందుకు ఎగబడ్డారు. మండలంలోని గట్టుదుద్దెనపల్లి, చెంజర్ల, ఈదులగట్టెపల్లి, మానకొండూర్‌లోని పలు పెట్రోలు బంకులకు సాయంత్రం ఒక్కసారిగా వాహనదారులు పోటెత్తారు. దీంతో బంక్‌ల నిర్వాహకులు ఇబ్బందులు పడ్డారు.

